# తిరుగుబాటు

"అయితే ఏమిటి?" అనేది నేను చాలా తరచుగా ఉపయోగించే ప్రశ్న.

ఆ మాటల్ని నేను మొదట ఎపుడు ఉచ్చరించానో.. ఎవరి దగ్గర ఎలా నేర్చుకున్నానో తెలీదు కానీ.. అందర్నీ స్థాణువుల్ని చేసే విధంగా ఆప్రశ్నని చాలా సందర్భాలలో నేను సంధించాను.

నాకు బాగా గుర్తున్న మొదటి సంఘటన నేను నాలుగో తరగతి చదివేరోజుల్లో జరిగింది. మాది ఒక మామూలు వూర్లో మామూలు బడి. అప్పుడు మాక్లాసులో ఇద్దరు పిల్లలుండేవారు. "వెనుకబడిన తరగతులు" అనేమాట అప్పట్లో నాకు తెలీదు కానీ వాళ్ళిద్దరూ దానికి చెందినవారే. లాజర్.. మాణిక్యం.

ఇద్దరూ ఒకే చోటునుంచి వచ్చేవారు. అంటే ఒకేచోట వేసుకున్న గుడిసెలలోనుంచి. ఒకటే జట్టుగా తిరిగేవారు.

టీచర్ల చేత ఎప్పుడూ తిట్లు తింటూండేవారు. పుస్తకాలుండేవి కాదు. హోమ్ వర్క్ చేసేవాళ్ళు కాదు. ఒకటేమిటి? అన్నిట్లో వెనకే ఉండేవారు.. క్లాసులో కూర్చోవడంతో సహా.

మోకాళ్ళ మీద, పెదవుల మీద నిరంతరం కురుపులుండేవి. ఇద్దరిలోకీ మాణిక్యం కాస్త నయంగా వుండేది. లాజర్ అయితే మట్టికొట్టుకుపోయిన నిక్కరుతో, చొక్కాతో మరీ చూడలేనట్లుగా వుండేవాడు.

ఒకరోజు... మా రేవతి టీచర్ క్లాసుకి వస్తూ అటెండెన్స్ రిజిస్టర్ తేవడం మర్చిపోయారు.

సతీష్. అతను క్లాసులో అందరికన్నా గొప్పవాళ్ళ పిల్లాడు. ఫస్ట్ మార్క్ కోసం పోటీ పడేవాళ్ళలో ఒకడు. క్లాస్ లీడర్ . టీచర్ అతన్ని పిల్చి ఆఫీస్ రూంలోకి వెళ్ళి రిజిస్టర్ తీసుకురమ్మన్నారు. వాడు తీసుకువచ్చాడు.

వస్తూన్నపుడే అతని మొహంలో ఒకరకమైన అల్లరి నవ్వు నాకు కనిపించింది. టీచర్‌కి రిజిస్టర్ యిచ్చి కూర్చోగానే శ్రీహరి చెవిలో ఏదో గొణగడం... వాడు రవితో.. రవి శ్రీకాంత్ తో.. యిలా అందరూ ఏదో చెప్పుకోవడం.. ఒక్కొక్కరి మొహంలోకి మెల్లగా అల్లరి నవ్వు పాకడం.. అంతా నేను గమనించాను.

టీచర్ అటెండెన్స్ తీసుకుని వెళ్ళిపోగానే ఒక్కసారిగా కోలాహలం మొదలయింది.

అసలు సంగతేమిటంటే... సతీష్ వస్తూ వస్తూ రిజిష్టర్ తెరిచి అందరి యింటిపేర్లూ చదివాడు. లాజర్.. మాణిక్యంలవి కూడా.

వాళ్ళిద్దరి యింటిపేరూ ఒకటే. "పంది".

ఆరోజునుంచీ వాళ్ళ అవస్థ మొదలయింది. వాళ్ళు రాగానే "పంది లాజర్... పంది మాణిక్యం..." అంటూ అందరూ కోరస్ గా అరిచేవాళ్ళు. లాజర్ నయితే "రేయ్ పందీ!" అనే పిల్చేవాళ్ళు.

ఆ చిన్నమనసులలో తమతోటి పిల్లలిద్దరినీ ఏడిపించాలనే కోరిక ఎంత దారుణంగా వుందో తల్చుకుంటే నాకు యిప్పటికీ ఆశ్చర్యంగా వుంటుంది.

పోట్లాడే తెలివితేటలు వాళ్ళిద్దరికీ ఎలానూ లేవు. పోనీ ఏదో ఒకరకంగా సమర్థించుకుందామన్నా ఎలా! "పప్పు" కాదు.. "నెయ్యి" కాదు... "బియ్యం" కాదు. కనీసం "బంక" కూడా కాదు.

"పంది." దాన్ని సమర్థించుకునే ప్రశ్నే లేదు. వింటూనే ప్రతివాడూ వెక్కిరించి తీరవలసిన పేరయ్యే.

ఒకరోజున.. అసెంబ్లీ జరుగుతోంది.

నేను ముందు వరుసలో నిలుచున్నా. నాప్రక్కనే మాణిక్యం నిల్చుంది. మావెనుక సతీష్ వాళ్ళు నిల్చున్నారు. ఒక పుల్ల పుచ్చుకుని మాణిక్యం వీపు మీద గుచ్చుతూ "పంది.. పంది... పంది" అనడం మొదలుపెట్టాడు సతీష్.

ఆపిల్ల అయిదునిమిషాలు ఓర్చుకుని ఆతర్వాత బార్ మంది.

నిశ్శబ్దం ఒక్కసారిగా బ్రద్దలయింది. హెడ్మిస్ట్రెస్ తో సహా అందరి దృష్టి మావైపు మళ్ళింది.

"ఏమయింది?" అన్నారొక టీచర్. ఆపిల్ల వెక్కిళ్ళు పెడుతూ "..సతీషు..సతీషు.." అంది.

"సతీష్" అన్నారు టీచర్ పెద్దగా. అతను ముందుకి వచ్చి నిలబడ్డాడు.

"ఏమన్నావురా!" అతనికి భయం వేయనంత గట్టిగా అడిగారు టీచర్. అయినా అంతమంది జనంలో ప్రత్యేకంగా నిలబడడంతో వాడికి కొంచెం భయం వేసినట్లే వుంది.

తడబడుతూ "టీచర్.. టీచర్.. వాళ్ళ యింటిపేరు పంది టీచర్..." అన్నాడు.

అందరికీ వినపడలేదు వాడి గొంతు.

వినబడినంతమేర ప్రతివారిమొహంలోనూ చిరునవ్వు మెరిసింది. మిగతా క్లాసుల పిల్లలూ.. టీచర్లూ.. అందరూ కామ్ గా నిలుచున్నారు. ప్రశ్న అడిగిన టీచర్కి కూడా గబుక్కున ఏమనాలో అర్థం కాలేదనుకుంటా.. "అవును, నిజమే కదా!" అనుకుంటున్న భంగిమలో నిలబడిపోయింది. హెడ్ మిస్ట్రెస్ ఒక్క అడుగు యిటువైపు వేశారు.

సరిగ్గా అదేసమయంలో నేను మరో అడుగు ముందుకి వేసి.. రెండు చేతులూ నడుముమీద పెట్టుకుని.. "అయితే ఏమిటి?" అన్నాను.

ఒక్కసారిగా ఆ ప్రదేశం స్థంభించినట్లయింది. గాలి కూడా వులిక్కిపడి ఆగింది. నాగొంతులో వినబడిన ఖంగుమన్న శబ్దం యిప్పటికీ నా చెవులలో ప్రతిధ్వనిస్తుంది.

అరక్షణం తర్వాత అందరినోళ్ళలోనుంచీ "ఆ!" అన్న ధ్వని బయటకి వచ్చింది.

నేను అదే స్వరంతో మళ్ళీ అడిగాను సతీష్ ని. "అయితే ఏమిటి? వాళ్ళ యింటిపేరు పంది.. మీ యింటి పేరు ముండి. అయితే యేమిటి?" అన్నాను.

నాకు అక్షణం స్పష్టంగా గుర్తుంది. మా హెడ్ మిస్ట్రెస్ పరుగెత్తుతున్నట్లుగా నా దగ్గరికి వచ్చారు. రెండుచేతులతో నన్ను పూర్తిగా పైకి ఎత్తుకుని రెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకున్నారు. ఆతర్వాత... నన్ను క్రిందికి దించకుండానే సతీష్ వైపు తిరిగి, "..తప్పు.. అలా అనకూడదు.. మాణిక్యానికి సారీ చెప్పు" అన్నారు.

అదీ మొదటి సంఘటన.

ఆతర్వాత ఆస్కూళ్ళో నేను ఏడో తరగతి వరకూ చదివాను. టీచర్లందరూ నన్ను ఒక అద్భుతాన్ని చూసినట్లు చూసే వాళ్ళు.

హెడ్ మిస్ట్రెస్ నాకు ఎప్పుడు ఎదురుపడినా బుగ్గ మీద ఒక ముద్దు యిచ్చే ముందుకి కదిలేవాళ్ళు.

టెన్త్ చదువుతూండగా ఒకరోజు మాటల సందర్భంలో.. నాఫ్రెండ్ "నేను యింజినీరునవుతా" అంది. "నేను కూడా" అన్నాను నేను.

ఆమె ఆశ్చర్యంగా చూసి, " మా అమ్మా నాన్నా యిద్దరూ డాక్టర్స్" అంది చాలా అసందర్భంగా. "నువు ఒక మామూలు టీచర్ కూతురువి కదా! నీ కోరిక తీరకపోవచ్చు" అన్న ధోరణిలో.

నేను నవ్వాను. "అయితే ఏమిటి?" అన్నాను.

ఆమె వులిక్కిపడింది. తను అన్న మాటల్లోని భావం నాకు అర్థమయిందని తెలుసుకుని నొచ్చుకుంది. కానీ నాకు మాత్రం నేను వేసిన ఆప్రశ్న నా ధ్యేయాన్ని నెరవేర్చుకునే స్థైర్యాన్నిచ్చింది. పార్ట్ టైం వుద్యోగం చేస్తూ, ట్యూషన్లు చెప్తూ నా చదువు పూర్తి చేశాను నేను.

ఇలా ఎన్నో సందర్భాలు. "కట్నాలివ్వక పోతే పెళ్ళిళ్ళు కావమ్మాయీ!"

అనేవారు. "అయితే ఏమిటి?" అనేదాన్ని నేను. "పెళ్ళి కాకుండా స్త్రీ బ్రతకలేదా!"

"వాళ్ళదంతా అదోరకం మనస్తత్వం బాబూ! వాళ్ళతో మనం నెగ్గలేం" అనేవారు. "అయితే ఏం! దేవుడు సృష్టించిన మనుషులే కదా!" అనేదాన్ని.

"అమ్మో! అంత దూరమా! క్రొత్తచోటుకా!" అంటే "అయితే ఏం! మనకి నోరుంది కదా!" అనేదాన్ని.

ఇంటర్వ్యూలలో పోటీకి వచ్చిన వాళ్ళు "నాకు రికమండేషన్ వుంది" అంటే "అయితే ఏమిటి" అనేదాన్ని నా ఫస్ట్ మార్కుల సర్టిఫికెట్స్ సర్దుకుంటూ.

ఇలా ఒక్క విషయమేమిటి! చిన్న సమస్యల నుంచి జీవిత సమస్యలదాకా ప్రతివిషయాన్నీ ఆ ఒక్క ప్రశ్నతో జయించుకువచ్చాను నేను.

నిస్పృహ నాకు సాధారణంగా కలిగేదికాదు. ఒకవేళ ఎపుడయినా అది సాహసించి నాదరి చేరబోయినా.. యిదిగో యిలా మెడపైకెత్తి.. "అయితే ఏమిటి?" అనుకునేదాన్ని. అంతే. విపరీతమయిన ధైర్యం వచ్చేసేది.

చదువు.. వుద్యోగం.. పెళ్ళి.. పిల్లలు.. జీవితంలో చాలా దశలు దాటాను. అయితే ఈదశలో కూడా.. నలభై ఏళ్ళ ఈవయసులో కూడా నాలో అదే ఉత్సాహం వుంది. ఇప్పటికీ ఎంత పెద్దసమస్య ఎదురైనా, ఆత్మవిశ్వాసంతో కొట్టుకునే గుండెతో "అయితే ఏమిటి!" అనగలను నేను.

నాలుగేళ్ళ క్రితం.. ఉద్యోగానికి రిజైన్ చేసి, నా స్వంత సంస్థని ప్రారంభించాను. ఎలక్ట్రానిక్ రంగంలో ఇపుడు దానికి జాతీయస్థాయి గుర్తింపు వుంది.

నాకు సంబంధించిన ఎంతోమంది నా విజయానికి తమ ఆనందాన్నీ, గర్వాన్నీ తెలియచేస్తున్నారు. ఈరోజు నేను చదివిన కాలేజీ వార్షికోత్సవం. నన్ను ముఖ్య అతిథిగా పిలుస్తూ మా ప్రిన్సిపాల్ ఎంతగానో పొగిడారు. నీ ఉపన్యాసం ద్వారా మావిద్యార్థులకి మంచి సందేశాన్నివ్వాలి" అన్నారు.

బి. శ్రీవల్లీ రాధిక

"సందేశం" ఆమాట వినగానే నా మనసులో ఉపన్యాసం సిద్ధమయింది.
నాకు ఆత్మస్థైర్యాన్ని, అనేక విజయాలనీ యిచ్చిన అద్భుత సూత్రాన్ని...
ఆ వేయివరహాల వాక్యాన్ని అందరితోనూ పంచుకోవాలన్న ఆశ కలిగింది.
పెన్ను, పేపర్ అందుకున్నాను. మొదట "అయితే ఏమిటి" అన్న వాక్యం.
దాని క్రింద ఒక గీత. ఆ తర్వాత వ్రాయడం మొదలుపెట్టాను.
ఎన్నో విషయాలు... ఎన్నెన్నో విషయాలు.. యువత "అయితే ఏమిటి!"
అంటూ ప్రశ్నించాల్సిన వాటన్నిటినీ నేను లిస్ట్ అవుట్ చేశాను.
కులం.. మతం.. ధనం.. బలం.. అవినీతి.. అజ్ఞానం.. అర్థం లేని
ఆచారాలు.. అన్నిటినీ "అయితే ఏమిటి!" అనమన్నాను.
ఉపన్యాసం కాబట్టి యింకొంచెం అందంగా చెప్పే ప్రయత్నం చేశాను.
"సృష్టిలోని ప్రతి జీవికీ ఓ అందం వుంది. ఓపరమార్థం వుంది. సింహం
గొప్పదనం సింహానిదయితే... చిట్టెలుక గొప్పదనం చిట్టెలుకది. అవును!
దేవుడు దానికేం అన్యాయం చేశాడని! మగసింహానికి ఆడసింహం తోడూ..
సింహం పిల్లలూ.. సింహం నేస్తాలూ.. సింహం శత్రువులూ వుంటే..
చిట్టెలుకకి దానికి కావలసిన తోడూ.. దాని పిల్లలూ.. దాని నేస్తాలూ..
దానికీ వున్నాయి. ఎవరి బ్రతుకు వారిది. ఎవరి ఆనందం వారిది!..."
ఈ ధోరణిలో సాగింది నా వుపన్యాసం.
నాలుగు పేజీలు. మొత్తం చదువుకుని సంతృప్తిగా నిట్టూర్చాను. ఆతర్వాత
మీటింగ్ కి బయల్దేరాను.
దారిలో మరోసారి నాజీవితమంతా సింహావలోకనం చేసుకున్నాను. నేను
యువతకి యివ్వగలిగిన గొప్ప సందేశం యింతకంటే మరేమీలేదని
ధృవపరుచుకున్నాను.
నేను వచ్చేసరికి మీటింగ్ మొదలవలేదు. ఇంకా అతిథులందరూ రాలేదు.
నేనొక్కదాన్నే పంక్చ్యువల్ గా అయిదున్నరకి వచ్చేశాను. ముందువరుసలో

కూర్చుని పరిసరాలని గమనించసాగాను.
ఎవరో అమ్మాయి వచ్చి నాగుండెలమీద బ్యాడ్జ్ తగిలించి వెళ్ళింది.
హుషారయిన అమ్మాయిలూ.. అబ్బాయిలూ.. ఆ యవ్వనోత్సాహపు వెల్లువని మురిపెంగా చూడసాగాను.
కర్రలతో కట్టిన దడికి అవతలగా `కొంతమంది పిల్లలు నిలబడి అందరినీ సర్దుతున్నారు. వరుసగా కూర్చోమని ఆదేశిస్తున్నారు.
నేనలా చూస్తూండగానే.. ఒక మోటార్ సైకిల్ రయ్యిన వచ్చి దడికి ప్రక్కగా ఆగింది. ప్రక్కగా కాదు.. దారికి అడ్డంగా! దానిమీద వున్న కుర్రాడు రాకుమారుడిలా నేలమీద పాదం మోపాడు. ఒక చేత్తో కళ్ళజోడు తీశాడు. మరో చేత్తో క్రాఫ్ సర్దుకున్నాడు.
ఆతర్వాత మందగమనంతో లోపలికి రాబోయాడు. వెహికిల్స్ అన్నిటినీ క్రమపద్ధతిలో పెట్టిస్తున్న మరొక అతను వడివడిగా అక్కడికి వచ్చాడు.
"బండి అటు ప్రక్కన పెట్టాలి" అన్నాడు.
మొదటి కుర్రాడు తమాషాగా కదిలాడు. ఎడమకాలితో అతని ముందుకు దూకుడుగా వెళ్ళి ఏమిటన్నట్లుగా కళ్ళెగరేశాడు.
"అందరూ బళ్ళు అటువైపు పెట్టారు" అన్నాడతను.
"అయితే ఏంటి?"
నేను వులిక్కిపడ్డాను ఆప్రశ్నకి. అప్రయత్నంగా లేచి నిలబడ్డాను.
"అయితే ఏంటేంటి? దారిలో పెడితే ఎలా! అటుప్రక్కన పెట్టు."
"ఈ చోటు నీదా!"
"చోటు నాది కాదు. పెట్టించే డ్యూటీ నాది."
"నేను పెట్టను. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో ఫో."
నేను స్థాణువునయ్యాను. కేవలం వ్యతిరేకించాలన్న ధోరణి.. తిరగబడాలన్న కోరిక కాకపోతే యింకేమన్నా అర్థముందా ఆమాటలకి!

ఎవరో లెక్చరర్ అటుప్రక్కకి రావడం.. అతనేదో చెప్పడం.. యితనింకేదో అనడం.. అయిదునిమిషాల చర్చ తర్వాత అతను బండి ప్రక్కన పెట్టడం.. అంతా నాకు కనిపిస్తూనే వుంది.

కానీ బుర్రకి ఒక్క ముక్క అర్థం కానంత అయోమయం ఆవరించింది. "ఏమిటీ ధోరణి!" నివ్వెరపోతూ కుర్చీలో కూర్చున్నాను.

గలగలలాడుతూ నలుగురు అమ్మాయిలు వచ్చారు. "మేడమ్! లోపలికి రండి" అంటూ.

నేను లేచాను. అపుడే వచ్చిన మరో యిద్దరు అతిథులతో పాటు లోపలికి నడిచాను.

స్వీటూ.. యింకేదో ఫలహారం.. కూల్ డ్రింకూ వచ్చాయి.

తెల్లటిచీరల్లో తిరుగుతున్న అమ్మాయిలను గమనిస్తుంటే నాకు పాతరోజులు గుర్తొచ్చాయి.

ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అందరూ ఫంక్షన్ రోజున తెల్లచీరల్లో రావాలన్న రూల్ యిప్పటికీ మారలేదన్న మాట అనుకున్నాను.

రకరకాల తెల్లచీరలు.. కాటన్ .. ఆర్గండీ.. షిఫాన్.. ముదురు రంగు చిన్న పూలూ.. లేతరంగు పెద్ద పూలూ.. దేవలోకం సెట్టింగ్‌లా వుంది. నా ప్రక్కన నిల్చున్న అమ్మాయిని పరీక్షగా చూశాను నేను. చాలా అందంగా వుంది. కానీ మొహమెందుకో చిన్నబోయింది. ఏడ్చిందేమోనన్నట్లుగా ఆమె కళ్ళూ, ముక్కూ ఎర్రబడ్డాయి.

ఆమె తలత్రిప్పి నావైపు చూడగానే.. "ఏమైంది!" అన్నాను నేను.

"..మేడమ్!.." అంది ఆమె అర్థం కానట్లు చూస్తూ.

"ఏదయినా ప్రాబ్లమా!" అన్నాను.

ఆమె తటపటాయింపుగా చూసింది. "దేనికో బాధ పడుతున్నట్లున్నావ్!" నేను రెట్టించాను.

అందమైన పలువరుస మెరిసేలా హాయిగా నవ్వేసింది ఆఅమ్మాయి. "ఏంలేదు మేడమ్! ఏదో చిన్న గొడవ." అంది విషయాన్ని తేలికచేసే ప్రయత్నం చేస్తూ.

"ఈజ్ టీజింగా!" అన్నాను నేను వదిలిపెట్టకుండా.

మరోసారి నవ్వింది ఆఅమ్మాయి. "లేదు మేడమ్" అని ఒక్క క్షణం ఆగింది. నేను జవాబు కోసం ఎదురుచూస్తున్న భంగిమలో తదేకంగా ఆమె మొహం వైపే చూపు నిలపడంతో.. యిక తప్పదన్నట్లు కొనసాగించింది.

"ఇక్కడ పనివాళ్ళు మేడమ్! ఏపని ఒక పద్ధతిలో చేయరు. వాళ్ళతో ఈ ఏర్పాట్లన్నీ చేయించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. హాలు క్లీన్ చేయమంటే.. యిటు చెత్త అటూ.. అటు చెత్త యిటూ నెట్టి వెళ్తారు. వాళ్ళకి తెలియడం లేదుకదా అని సులువుగా, వివరంగా పని చేసుకునే సలహా చెప్తే.. ఎంత కోపం వచ్చిందో వాళ్ళకి! నానా మాటలూ అన్నారు. "ఏంది ఈమె మాకు చెప్పేది! పనిచేసుకోవడం మాకు తెలీదా! ఏమిటో ఈమె నేర్పిస్తదంట. .. చదువుకున్నానని గొప్పేమో.. అయితే ఏందంట!.. జుట్టు పట్టుకుని ఒక చేత్తో గుంజిపారేస్తా.. చదువుకుంటే ఏమి చేస్తదంట.." .. ఈరకంగా మాట్లాడారు మేడమ్!.. నాకు చాలా ఏడుపు వచ్చింది. ఏదో మూర్ఖులు.. చదువులేనివాళ్ళు.. అని సరిపెట్టుకోడానికి కూడా లేకుండా.. నువు చదువుకుంటే ఎవరికి గొప్ప! నీకు చదువుంటే ఏమిటి! అని వాళ్ళు ప్రశ్నించడం మరీ బాధగా అనిపించింది. చదువుకూ సంస్కారానికీ విలువ లేనందుకు బాధ వేసింది. "చదువుకున్నావా .. అయితే ఏమిటి!" అంటే యింకేం మాట్లాడతాం మేడమ్! నాకసలు ఆ "అయితే ఏమిటి!" అనే మాటంటేనే అలర్జీ. ప్రతివాడూ అదేమాట.."

నేను ఉలిక్కిపడ్డాను. "అయితే ఏమిటి?" అని ప్రశ్నించడం తప్పా!" అన్నాను ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"తప్పు కాదు మేడమ్! దారుణం. మూర్ఖత్వానికి పరాకాష్ఠ." కచ్చగా చెప్పింది ఆమె.

"మొన్నటికి మొన్న... కాలేజీలో అందరికన్నా శుంఠవెధవ!... వాడు నాకు ప్రేమలేఖ వ్రాశాడు. కంపరం పుట్టింది నాకు. అది వాడి మొహాన విసిరికొట్టి "సిగ్గులేదురా నీకు! ఒక్కొక్క పరీక్షా నాలుగుసార్లు తప్పుతున్నావు. నువు నాకు ప్రేమలేఖ వ్రాస్తావా! అంటే "అయితే ఏమిటి!" అన్నాడు వాడు చిద్విలాసంగా.

"..నాకు చదువు రాదు. నీకు చదువొచ్చు. అయితే ఏమిటి!" అన్నాడు. ఏమీ లేదురా చచ్చువెధవా! అయితే ఏమీ లేదు. నీచావు నువ్వు చావు. అనుకుని వచ్చేశాను..."

ఆఅమ్మాయి చెప్తూంటే నాకు ఒక్కక్షణం ఫక్కున నవ్వొచ్చింది కానీ.. ఆమరుక్షణం గుండె గుభేలుమంది.

ఇపుడు నేను స్టేజ్ మీద ఏం మాట్లాడాలి! అయితే నాఆలోచనలూ.. యిన్నాళ్ళుగా నేనేర్పరుచుకున్న అభిప్రాయాలూ.. అన్నీ తప్పేనా! నానాలుగు పేజీల ఉపన్యాసం వృథాయేనా!

ఈపిల్ల చెప్పేది వింటూంటే అలాగే అనిపిస్తోంది!

కులాన్ని..ధనాన్ని.. ఆధిక్యతలుగా ఒప్పుకోకపోవచ్చు."అయితే ఏమిటి!" అని ప్రశ్నించవచ్చు. కానీ చదువునీ.. తెలివినీ.. మంచినీ.. నీతినీ ప్రశ్నించడం!

"నువు మంచివాడివా! అయితే ఏమిటి!" అనే తిరుగుబాటు నిజంగా దారుణమే. అది ఒప్పుకోకూడని విషయమే.

ఆరకమైన తిరుగుబాటు నేటి యువతలో వుందనడానికీ.. ఆఅమ్మాయి చెప్తూన్నది అక్షర సత్యమనడానికీ ప్రత్యక్ష ఉదాహరణ యిందాకే చూశాను నేను.

మీటింగ్ మొదలవుతూన్న సూచనగా స్టేజ్ దగ్గర సందడి మొదలయింది.
ఇంకొద్ది క్షణాల్లో నేనక్కడికి వెళ్ళాలి. వెళ్ళి ఏం చెప్పాలి!!
ప్రతివిషయాన్ని "అయితే ఏమిటి?" అని ప్రశ్నించమన్నది నా ఉపన్యాసం సారాంశం. దానిని కొద్దిగా మార్చి "ప్రతిదాన్నీ కాదు. చెడునీ.. అవినీతినీ ప్రశ్నించాలి. నీతినీ న్యాయాన్నీ కాదు" అని చెప్పాలా!
అపుడు చెడుకీ.. మంచికీ అడ్డుగీత ఎక్కడ గీయాలి!
ఏది నీతో ఏది అవినీతో ఎలా నిర్ణయించాలి! దేన్ని ప్రశ్నించాలో దేన్ని ప్రశ్నించకూడదో ఎలా తెలుసుకోవాలి!
నాకు హటాత్తుగా కాళ్ళలో వణుకు మొదలయింది. "పదండి మేడమ్!" అంది ఆఅమ్మాయి చిన్న స్వరంతో.
నేను ఆమె చేయి గట్టిగా పట్టుకున్నాను. బ్యాగ్ లోనుంచి పేపర్లు తీసి ఆమె చేతిలో పెట్టి "చదువు" అన్నాను.
ఆమె అయోమయంగా చూసింది.
"త్వరగా చదువు." నేను కంగారుగా చెప్పాను. "అది నేనిపుడు చెప్పాలనుకున్న ఉపన్యాసం."
ఆమె చదవడం పూర్తిచేసి నాముహంలోకి ప్రశ్నార్థకంగా చూసింది. "ఇపుడు చెప్పు! అయితే ఏమిటి! అని ప్రశ్నించడం తప్పేనంటావా!" అన్నాను.
ఆఅమ్మాయి ఆలోచనగా నిలబడిపోయింది.
"అయితే ఏమిటి! అన్న ప్రశ్న మూర్ఖత్వానికి పరాకాష్ట అన్నావు నువ్విందాక! నేను మూర్ఖురాలినేనంటావా!" అన్నాను.
ఆఅమ్మాయి కంగారుగా నా కళ్ళలోకి చూసింది. కానీ ఆప్రశ్నని నేను నిజాయితీగా అడిగానని.. నిజమైన సంకోచంతో అడిగానని అర్థమవగానే తెప్పరిల్లింది.
ఒక్కక్షణం తర్వాత.. సన్నని గొంతుతో చెప్పింది.

బి. శ్రీవల్లీ రాధిక

"ఏమో మేడమ్! నాకు తెలీడం లేదు... సమస్యలమీద తిరుగుబాటు చేయాలి నిజమే కానీ.. సామాజిక నియమాల మీద చేయకూడదు కదా!"

నేను అసహాయంగా నవ్వాను. "సమస్యలమీద తిరుగుబాటు చేయాలి, సామాజిక నియమాలమీద కాదు." వాక్యం బానేవుంది కానీ.. "సామాజిక నియమాలే సమస్యలయితే!" అదికదా అసలు ప్రశ్న!

మాతరం వాళ్ళం అలాంటి సామాజిక నియమాలనే అయితే ఏమిటి! అని ప్రశ్నించాం. ఆప్రశ్న యిచ్చిన ఆత్మస్థైర్యంతో విజయాలు సాధించాం.

కానీ నేటి తరం! నేటి తరం ఆ ప్రశ్నని మాత్రమే పట్టుకుని ముందుకు సాగుతోంది.

ప్రశ్నించడం అనవసరం అని ఎలా అంటాం!

అర్థంలేని పురుషాహంకారం కొండలా కనిపిస్తూనే వుండగా ఆప్రశ్నని స్త్రీల చేతుల్లోనుంచి ఎలా లాక్కుంటాం!

కానీ.. కానీ.. అడ్డం లేకుండా పెరిగిన అవినీతి వికటాట్టహాసం చేస్తూండగా.. ఆప్రశ్నని ఆయుధంలా దానికి ఎలా అందిస్తాం!

హటాత్తుగా నాకళ్ళు తెరుచుకుంటున్నాయి... నాకంతా కనిపిస్తోంది... అంతా అర్థమవుతోంది..!

నేటి సమాజంలో మంచి చెడు మీద చేస్తున్న తిరుగుబాటు కంటే.. సాధిస్తున్న ప్రయోజనాల కంటే .. చెడు మంచిని చూసి చేస్తున్న వేళాకోళం ఎక్కువవుతోంది.

"అయితే ఏమిటి!" అన్న ప్రశ్న బలహీనుడి చేతిలో అంకుశం అవ్వాల్సింది పోయి బలవంతుడి చేతిలో ఆయుధం అవుతోంది. జ్ఞాని చేతిలో దీపం అవ్వాల్సింది పోయి మూర్ఖుడి కళ్ళకి గంత అవుతోంది.

మొత్తం సమస్యంతా నాకు అర్థం అవుతోంది.

కానీ నేనివ్వాల్సిన సందేశం ఏమిటో తెలియడం లేదు.

స్టేజ్ మీద నుండి నన్ను పిలుస్తున్నారు. "అయితే ఏమిటి!" అనుకుంటూ మందుకు నడిచేందుకు నాకాళ్ళు సహకరించడం లేదు.

*****

("ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక - 21.05.1997)